JAYABHERIDAILY.COM

ప్రభాత

# జయభేరి

తెలుగు దినపత్రిక

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

మేడ్చల్ - మల్కాజిగిరి I శనివారం 11-10-2025
Medchal - Malkajgiri I Saturday 11-10-2025

jayabherinews

సంపుటి : 02 I సంచిక : 135 I పేజీలు : 8 I వెల : 5
Vol. 02 I Issue 135 I Pages : 8 I ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889
call me

jayabheripaper@gmail.com





# ప్రత్యామ్నాయాలపై సర్కార్ దృష్టి

## ఆ పార్టీ ముందున్న 'బిగ్ త్రీ' ఆప్షన్స్

## సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే ఎత్తివేయించడం

## పాత రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించడం

## గవర్నర్ ఆమోదం, చట్ట సవరణపై దృష్టి పెట్టడం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ సర్కార్ జారీ చేసిన జీవో నెంబర్ 9 అమలుపై హైకోర్టు మధ్యంతర స్టే విధించడం తెలిసిందే. దీంతో, స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. కోర్టు ఆదేశాలను అమలు చేస్తామని ఆ ప్రకటనలో పేర్కొంది.

...మిగతాది 2 లో

**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 10:**

జీవో నెంబర్ 9పై హైకోర్టు మధ్యంతర స్టే విధించడంతో, ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ముందు మూడు ప్రధాన ఆప్షన్స్ ఉన్నాయి కామారెడ్డి డిక్లరేషన్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఈ హామీ మేరకు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తూ జీవో ఎం.ఎస్. నెంబర్ 9ని జారీ చేసింది. అయితే, ఈ జీవో అమలుపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంతో, ఇప్పుడు ఆ పార్టీ ముందున్న చట్టపరమైన, రాజకీయపరమైన 'బిగ్ త్రీ' ఆప్షన్స్ ఇవే:

**ఆప్షన్ 1: సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే ఎత్తివేయించడం**

హైకోర్టు జీవో నెంబర్ 9పై విధించిన స్టేను సుప్రీంకోర్టులో సవాల్ చేయడం ప్రభుత్వానికి ఉన్న తొలి ఆప్షన్. దీనిపై స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసి, విచారణకు వచ్చేలా చూడటం. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ట్రిపుల్ టెస్ట్ ప్రక్రియను రిజర్వేషన్లు పెంపు సందర్భంగా పాటించినట్లు చట్టపరంగా నిరూపించాల్సి ఉంటుంది. ఇందుకుగాను, బీసీ రిజర్వేషన్లు పెంచడానికి ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుల గణన సర్వే, బీసీ కమిషన్ ఏర్పాటు, ఆ కమిషన్ చేసిన అధ్యయనం, సిఫారసులను సుప్రీంకోర్టు ముందు ఉంచడం ద్వారా, తమకు అనుకూలంగా అంటే జీవో నెంబర్ 9పై స్టేను ఎత్తివేసేలా చేయడం మొదటి ఆప్షన్‌గా చెప్పవచ్చు.

**ఆప్షన్ 2: పాత రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించడం**

హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికలు త్వరగా నిర్వహించాలనుకుంటే, పాత రిజర్వేషన్లనే అమలు చేస్తూ ఎన్నికల ప్రక్రియలో ముందుకు సాగడం రెండో ఆప్షన్. లేదా ప్రభుత్వం దీనిపై సుప్రీంలో పిటిషన్ వేయకపోయినా, ఒకవేళ పిటిషన్ వేసినప్పటికీ జీవో నెంబర్ 9పై స్టే ఎత్తివేయకపోతే ఉన్న మరో ఆప్షన్... 42 శాతం రిజర్వేషన్లు బదులు, పాత రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహించడం. అప్పుడు ఈ రిజర్వేషన్లు సుప్రీంకోర్టు తీర్పు మేరకు అంటే 50 శాతం లోపు ఉండటం వల్ల లోకల్ బాడీ ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. దీనివల్ల హైకోర్టు తీర్పుకు కట్టుబడి ఉండటమే కాకుండా, కేంద్రం నుంచి స్థానిక సంస్థలకు నిధులు అందే అవకాశం ఉంది. అయితే, ఈ ఆప్షన్ ప్రకరం కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తే, ప్రతిపక్షాలు, బీసీ సంఘాల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొనే అవకాశం ఉంది.

...మిగతాది 2 లో



# మచాడోకు 2025 నోబెల్ శాంతి బహుమతి

■ **వెనిజులా ప్రజల హక్కుల కోసం పోరాడినందుకు పురస్కారం**

**జయభేరి, న్యూ డిల్లీ అక్టోబర్ 10 :**

వెనెజువెలా దేశానికి చెందిన మరియా కొరీనా మచాడోకు ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి దక్కింది. ఈ విషయాన్ని నోబెల్ కమిటీ తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించింది. 2025 సంవత్సరానికి గాను మచాడో నోబెల్ శాంతి బహుమతికి ఎంపికయ్యారు. మరియా కొరీనా.. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడినందుకు గానూ ఈ పురస్కారం లభించింది. కాగా అత్యున్నత పురస్కారం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. ఇదిలావుంటే హిరోషిమా, నాగసాకిల్లో అణుదాడి నుంచి బయటపడిన బాధితుల పక్షాన పోరాడుతోన్న జపాన్‌కు చెందిన 'నిహాన్ హిడాంక్యో' సంస్థకు గత ఏడాది నోబెల్ శాంతి బహుమతి దక్కింది. మరియా కొరీనా

...మిగతాది 2 లో



# హమ్మయ్య.. తగ్గిన డాలర్

■ **పుంజుకుంటున్న రూపాయి..**

**జయభేరి, న్యూఢిల్లీ:**

చాలా కాలం తర్వాత కరెన్సీ మార్కెట్ నుండి శుభవార్త వచ్చింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ గణనీయంగా పెరిగింది. ఈ పెరుగుదల కేవలం 10 పైసలు మాత్రమే అయినప్పటికీ, చాలా కాలంగా రూపాయి విలువ తగ్గుతూ వస్తున్నందున దీనిని సానుకూలంగా భావిస్తున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, రాబోయే రోజుల్లో రూపాయి విలువ మరింత పెరగవచ్చు. వాస్తవానికి, విదేశీ పెట్టుబడిదారులు మరోసారి భారతదేశంలో పెట్టుబడులు పెట్టడం ప్రారంభించారు. దీంతో రూపాయికి బలం చేకూరింది. అక్టోబర్ 8 నాటి క్షీణతను మనం మరచిపోయినా, అక్టోబర్ నెలలో పెరుగుదల కనిపించింది.

...మిగతాది 2 లో



# హైడ్రా ఎంట్రీతో అక్రమార్కులు పరార్

■ **రూ. 750 కోట్ల విలువైన భూమి స్వాధీనం**

**జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 10:**

హైదరాబాద్‌లో మరోసారి కబ్జాకు గురైన భూమిని స్వాధీనం చేసుకుంది హైడ్రా. బంజారాహిల్స్‌లో షేక్‌పేటలో ఈ 750 కోట్ల రూపాయల విలువైన స్థలాన్ని ప్రభుత్వానికి తిరిగి అప్పగించింది. మొన్నటి వరకు అక్రమ నిర్మాణాలపై దృష్టి పెట్టిన హైడ్రా ఇప్పుడు కబ్జాకు గురైన భూములపై ఫోకస్ చేసింది. ఓవైపు చెరువుల పునరుద్ధరణ, మరోవైపు కబ్జాభూముల స్వాధీనంతో ప్రజలన ప్రశంసలు అందుకుంటోంది. బంజారాహిల్స్‌లో కబ్జాకు గురైన స్థలంలో ఉన్న ఆక్రమణలను హైడ్రా ఇవాళ తొలగించింది. అక్రమార్కుల చెరలో ఉన్న 5 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. దాదాపు రూ.750 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. షేక్‌పేట మండలం బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించి షెడ్‌లు వేసుకున్నారు. వాటిని తలగించింది హైడ్రా.ఇప్పుడు స్వాధీనం చేసుకున్న 5 ఎకరాల ప్రభుత్వ భూమిలో

...మిగతాది 2 లో

# విశాఖ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక



**ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, అభివృద్ధి ప్రస్థానంలో రాష్ట్ర ప్రభుత్వం ఒక చారిత్రాత్మక ముందడుగు వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశంలో రాష్ట్రానికి రూ. 1,14,824 కోట్ల విలువైన భారీ పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసినట్టు తెలుస్తోంది. ఈ నిర్ణయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊతాన్ని ఇవ్వడంతో పాటు, వేలాది ఉద్యోగాల కల్పనకు మార్గం సుగమం చేస్తుందని ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేస్తోంది.**

**జయభేరి, విజయవాడ, అక్టోబరు 10 :**

రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తీసుకున్న ఈ నిర్ణయాలు పారిశ్రామిక రంగంలో ఏపీని అగ్రస్థానంలో నిలబెడతాయని భావిస్తున్నారు.ఈ కేబినెట్ సమావేశంలో విశాఖపట్నం అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. విశాఖను దేశ ఆర్థిక రాజధాని ముంబై తరహాలో ఒక శక్తివంతమైన ఆర్థిక, సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ఇప్పటికే గూగుల్, టీసీఎస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజాలు విశాఖకు వస్తున్నాయని, నగరాన్ని ఒక అంతర్జాతీయ ఐటీ హబ్‌గా మార్చడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ పెట్టుబడులతో విశాఖ స్వరూపం పూర్తిగా మారిపోనుందని, మౌలిక సదుపాయాలు మెరుగుపడి ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు.రాజధాని అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసే దిశగా కూడా కేబినెట్ కీలక

...మిగతాది 2 లో

# మరి తమిళనాడులో 69% రిజర్వేషన్లు ఎలా



# ఆ పని కోసం రూ.10 లక్షలు డిమాండ్

■ **మ్యుటేషన్ కోసం భారీ డిమాండ్**

■ **బంధువుల ఇళ్లలోనూ తనిఖీలు**

**జయభేరి, చిట్యాల :**

తెలంగాణలో ఏసీబీ దూకుడు కొనసాగుతుంది. గత ఏడాది కాలంగా భారీగా అవినీతి అధికారులను ఏసీబీ పట్టుకుని జైలుకు పంపించింది. అందులో రూ.వేల నుంచి మొదలు వందల కోట్ల వరకు అక్రమంగా సంపాదించిన అధికారులు ఉండడం గమనార్హం. తాజాగా మరో అవినీతి చేపను ఏసీబీ ట్రాప్ చేసింది. లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది.

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ప్రత్యామ్నాయాలపై సర్కార్ దృష్టి

**ఆప్షన్ 3: గవర్నర్ ఆమోదం, చట్ట సవరణపై దృష్టి పెట్టడం**

గవర్నర్ ఆమోదం లేకుండానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు జీవో నెంబర్ 9ను జారీ చేయడంపై హైకోర్టులో వాదోపవాదాలు జరిగాయి. ఈ జీవోకు చట్టబద్ధ సవరణ చేయడం మరో ఆప్షన్ గా చెప్పవచ్చు. అంటే, బీసీ రిజర్వేషన్ల పెంపునకు అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును గవర్నర్ ద్వారా ఆమోదింపజేయడం, హైకోర్టు లేవనెత్తిన సాంకేతిక అంశాల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం ఈ ఆప్షన్‌లో భాగంగా చెప్పవచ్చు. జీవో ద్వారా కాకుండా శాసనసభ చేసిన చట్టం ద్వారా రిజర్వేషన్లు కల్పిస్తే చట్టపరమైన రక్షణ ఉంటుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు. కొంత సమయం పట్టినా, ఈ ప్రక్రియ ద్వారా అనుకున్న రీతిలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి ప్రయత్నించడం సరైన ప్రక్రియ. అయితే, చట్టసభలో ఆమోదించిన బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలపడం అన్నది తెలంగాణ సర్కార్ చేతుల్లో లేని పని. ఈ ఆప్షన్ ఎంతవరకు సక్సెస్ అవుతుందనడం మాత్రం సందేహాస్పదమే.అయితే, ఈ మూడు ఆప్షన్స్ కూడా సులువుగా ఎంచుకుని అమలు చేసే పరిస్థితి అయితే లేదు. కాకపోతే, సుప్రీంకోర్టు తలుపు తట్టే అవకాశాలు మాత్రం మెండుగా ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. బీసీ రిజర్వేషన్ల పెంపు అన్నది కాంగ్రెస్ సర్కార్‌కు కేవలం చట్టపరమైన సవాల్ మాత్రమే కాదు. కామారెడ్డి డిక్లరేషన్ను అమలు చేయడం, బీసీల పట్ల తమ చిత్తశుద్ధి ప్రదర్శనకు కీలకం. బీసీ వర్గాల మద్దతు నిలుపుకోవడం ప్రధానం. అయితే, ప్రభుత్వం ఏ ఆప్షన్ ఎన్నుకుంటుంది, 42 శాతం బీసీ రిజర్వేషన్లతో ఎన్నికలు ఎలా నిర్వహిస్తుందన్నది మాత్రం తెలియాలంటే వేచి చూడాల్సిందే.

## విశాఖ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

నిర్ణయాలు తీసుకుంది. అమరావతిలో రూ. 212 కోట్ల అంచనా వ్యయంతో నూతన రాజ్‌భవన్ నిర్మాణానికి పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. దీంతో పాటు, రాజధాని పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్లలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన నిధులలో 25% సీఆర్డీఏ (CRDA) ద్వారా కేటాయించాలని నిర్ణయించారు. ఈ చర్యలతో రాజధాని ప్రాంతంలో మౌలిక వసతుల కల్పన మరింత ముందుకు సాగనుంది. వీటితో పాటు పలు సంస్థలకు అవసరమైన భూ కేటాయింపులు, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన కరువు భత్యం (డీఏ) వంటి అంశాలపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా మంత్రులను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, కేవలం పెట్టుబడులకు ఆమోదం తెలపడమే కాకుండా, ఆయా సంస్థలు క్షేత్రస్థాయిలో తమ కార్యకలాపాలను వేగంగా ప్రారంభించేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖల మంత్రులపై ఉందని స్పష్టం చేశారు. "రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడానికి ఎంతో కష్టపడుతున్నాం. ఈ ప్రణాళికల ఫలాలు ప్రజలకు చేరేలా, వాటి ప్రాముఖ్యతను వారికి అర్థమయ్యేలా వివరించాలి," అని ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో మంత్రులు చురుకైన పాత్ర పోషించాలని ఆయన సూచించారు.

## హైడ్రా ఎంట్రీతో అక్రమార్కులు పరార్

జలమండలికి 1.20 ఎకరాలను గతంలోనే ప్రభుత్వం కేటాయించింది. 1.20 ఎకరాలతోపాటు మొత్తం 5 ఎకరాల భూమి తనదంటూ పార్థసారథి అనే వ్యక్తి కోర్టుకెళ్లాడు. చుట్టూ ఫెన్సింగ్ వేసి బౌన్సర్లతోపాటు వేటకుక్కలను కాపలాగా పెట్టారు. కోర్టులో వివాదం ఉంటుండగా మొత్తం 5 ఎకరాల భూమిని తన ఆధీనంలోకి తీసుకొని అందులో షెడ్డులు నిర్మించుకొని పహరా పెట్టారు. ప్రభుత్వ భూమిలోనే అడ్డా వేసుకొని మద్యం సేవించి భయభ్రాంతులకు గురి చేస్తున్నట్టు హైడ్రాకు ఫిర్యాదులు వచ్చాయి. అనేక నివాస ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు వాటర్ రిజర్వాయర్ నిర్మించాలని జలమండలి ప్రయత్నాలను కూడా పార్థసారథి అడ్డుకున్నారు. ఇన్ని విధాలుగా ఇబ్బంది పెడుతున్న పార్థసారథి, కబ్జాకు గురైన భూమి గురించి హైడ్రాకు ఫిర్యాదు చేసిన జలమండలి, రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా కబ్జాదారులను పరుగులు పెట్టించింది. అక్కడ ఆక్రమణలు తొలగించి భూమిని అధికారులకు అప్పగించింది. ఫేక్ సర్వే నంబర్ (403/52)తో ప్రభుత్వ భూమి కొట్టేసే ప్రయత్నం చేసిన పార్థసారథిపై కేసులు పెట్టింది. పార్థసారథిపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో 4 క్రిమినల్‌ను రెవెన్యూ, జలమండలితో పెట్టించింది. వాస్తవానికి 403 సర్వే నంబర్లో ప్రభుత్వ భూమి ఉంటే 403/52 బై నంబర్ వేసి పార్థసారథి ఆక్రమణలకు పాల్పడినట్టు నిర్ధారించింది హైడ్రా. అన్ రిజిస్టర్డ్ సేల్ డీడ్‌తో 5 ఎకరాల ప్రభుత్వ భూమి తనదంటూ పార్థసారథి క్లెయిమ్ చేస్తున్నట్టు నిర్ధారించుకుంది. షేక్పేట రెవెన్యూ అధికారుల లేఖ మేరకు భారీ బందోబస్తు మధ్య ఆక్రమణల తొలగించింది. పార్థసారథి వేసిన ఫెన్సింగ్‌తో పాటు లోపల ఉన్న షెడ్డులను తొక్కిపెట్టి పూడ్చేసింది. 5 ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులను ఏర్పాటు చేసింది.

## ఆ పని కోసం రూ.10 లక్షలు డిమాండ్

నల్గొండ జిల్లా చిట్యాల మండలంలో పట్టా భూమికి సంబంధించిన పనులు త్వరగా పూర్తి చేయడానికి లంచం డిమాండ్ చేసిన చిట్యాల తహసీల్దార్ గుగులోతు కృష్ణ ఏసీబీకి చిక్కారు. ఈ కేసులో తహసీల్దార్‌తో పాటు గట్టు రమేష్ అనే ప్రైవేట్ వ్యక్తిని కూడా అధికారులు అరెస్టు చేశారు. చిట్యాల మండలం గుండ్రంపల్లి గ్రామంలోని సర్వే నం. 172 లో ఉన్న వ్యవసాయ భూమిని మ్యుటేషన్ చేయడం, మరో వ్యవసాయ భూమి సర్వే నివేదికను చిట్యాల ఎస్సై పంపడం కోసం తహసీల్దార్ రూ.10లక్షల లంచం డిమాండ్ చేశారు. చివరికి రూ.2 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. ఇదే సమయంలో బాధిత వ్యక్తి ఏసీబీని ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు.. తహసీల్దార్ సూచన మేరకు ప్రైవేట్ వ్యక్తి గట్టు రమేష్ బాధితుడి నుంచి రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం డబ్బును రమేష్ కార్యాలయంలోని బీరువాలో భద్రపరిచినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఏసీబీ అధికారులు తహసీల్దార్‌తో పాటు గట్టు రమేష్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరినీ నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు. ఈ తహసీల్దార్‌పై గతంలో కూడా అవినీతి ఆరోపణలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం తహసీల్దార్‌తో పాటు, ఆయన బంధువుల ఇళ్లలో కూడా ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు.

## హమ్మయ్య.. తగ్గిన డాలర్

దీని ఫలితంగా పెట్టుబడిదారులకు రూ. 11 లక్షల కోట్ల లాభాలు వచ్చాయి. మరోవైపు డాలర్ ఇండెక్స్ తగ్గుతోంది. ముడి చమురు ధరలు కూడా తగ్గాయి. ముఖ్యంగా, కొన్ని EU దేశాల తర్వాత, బ్రిటన్‌తో కూడా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. గురువారం (అక్టోబర్ 9)న ఆర్థిక రాజధాని ముంబైలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, యూకే ప్రధాని కీర్ స్టార్మర్ మధ్య ద్వైపాక్షిక ఒప్పందం కుదిరింది. మరునాడే భారత కరెన్సీకి ప్రాణం లేచివచ్చింది. అదే సమయంలో, అమెరికా జనరిక్ ఔషధాలను సుంకాల నుండి మినహాయించడంతో భారతదేశానికి సానుకూల సంకేతాలు వెలువడుతున్నాయి. రూపాయి విలువ పెరగడానికి ఇదే కారణం. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కాస్త మెరుగైంది. రూపాయిలో పెరుగుదల కనిపించింది. శుక్రవారం ఇంటర్‌బ్యాంక్ విదేశీ కరెన్సీ మారకపు మార్కెట్లో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి 10 పైసలు పెరిగి 88.69 వద్ద ముగిసింది. దేశీయ మార్కెట్లలో బలం, ముడి చమురు ధరల పతనం రూపాయికి మద్దతు ఇచ్చాయి. బలమైన దేశీయ మార్కెట్లు, వస్తువుల ధరల తగ్గుదల రూపాయి పెరుగుదలకు కారణమని ఫారెక్స్ నిపుణులు తెలిపారు. కేంద్ర బ్యాంకు జోక్యం కూడా దేశీయ కరెన్సీకి మద్దతు ఇచ్చింది. అయితే, బలమైన యుఎస్ డాలర్ ఈ పదునైన పెరుగుదలను తగ్గించిందంటున్నారు. డేటా ప్రకారం రూపాయి 88.80 వద్ద ప్రారంభమైంది 88.5088.80 పరిధిలో ట్రేడింగ్ తర్వాత, 88.69 వద్ద ముగిసింది. దాని మునుపటి ముగింపు కంటే 10 పైసలు పెరిగింది. గురువారం, డాలర్‌తో పోలిస్తే రూపాయి 88.79 వద్ద ముగిసింది.

## మచాడోకు నోబెల్ శాంతి బహుమతి

మచాడోకు నోబెల్ శాంతి బహుమతి ప్రకటనకు ముందే ఆమెకు చాలా అంతర్జాతీయ పురస్కారాలు లభించాయి. కౌన్సిల్ ఆఫ్ యూరప్ 2024లో వాక్లవ్ హావెల్ మానవ హక్కుల పురస్కారం ఇచ్చింది. అదే ఏడాది సఖరోవ్ బహుమతిని ఎడ్మండో గొంజాలెజ్‌తో కలిసి అందుకున్నారు. 2019లో లిబరల్ ఇంటర్నేషనల్ ఫ్రీడమ్ ప్రైజ్ దక్కింది. 2018లో బీబీసీ ప్రకటించిన 100 అత్యంత ప్రభావవంతమైన మహిళల జాబితాలో చోటు దక్కించుకున్నారు.

# మరి తమిళనాడులో 69% రిజర్వేషన్లు ఎలా

**తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం ఆపసోపాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. న్యాయస్థానాల ముందు ఈ విషయంలో పోరాడాల్సిన పరిస్థితి ఉంది. ఇందుకు కారణం, ఇందిరా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రధానమైనది. రిజర్వేషన్లు 50 శాతం మించడానికి వీలు లేదు అని ఆ కేసులో సుప్రీం ఇచ్చిన తీర్పు, తెలంగాణ ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న 42 శాతం రిజర్వేషన్ల అమలును మోకాలొడ్డుతోంది.**



తమిళనాడు రాష్ట్రంలో మాత్రం 50 శాతం మించి రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. 1. తమిళనాడులో ప్రస్తుతం 69 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. ఆ వివరాలు ఇలా ఉన్నాయి:2. వెనుకబడిన తరగతులు 30%(దీనిలో బీసీ ముస్లింలకు 3.5% అంతర్గత రిజర్వేషన్ ఉంది)3. అత్యంత వెనుకబడిన తరగతులు/డీనోటిఫైడ్ కమ్యూనిటీలు 20%4. షెడ్యూల్డ్ కులాలు 18%షెడ్యూల్డ్ తెగలు 1% మొత్తం రిజర్వేషన్లు 69%తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్ల అమలు వెనుక సుదీర్ఘమైన చరిత్ర ఉంది. అక్కడి సామాజిక న్యాయ పోరాటం, అక్కడి రాజకీయ నేతలలో ఉన్న సంకల్పం, చట్టపరమైన వ్యూహాలను వారు అనుసరించడం వల్ల 50 శాతం మించి రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యమైంది. ఈ పూర్వాపరాల్లోకి వెళితే, తమిళనాడుపై ద్రవిడ ఉద్యమ ప్రభావం అంతా ఇంతా కాదు. ఈ రిజర్వేషన్ల డిమాండ్ చరిత్ర 1920ల నుంచి ఉంది. దీని లక్ష్యం ఒక్కటే: బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో అధిక ప్రాధాన్యత కల్పించడం. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మద్రాస్ రాష్ట్రంలో రిజర్వేషన్లు క్రమక్రమంగా పెరగడం ప్రారంభించాయి. 1971ల నాటికి అప్పటి డీఎంకే ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 25 శాతం నుంచి ఒక్కసారిగా 31 శాతానికి పెంచింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు 16 నుంచి 18 శాతానికి పెంచింది. దీంతో 1971ల నాటికి తమిళనాడు రాష్ట్రంలో రిజర్వేషన్లు 49 శాతానికి చేరాయి. ఆ తర్వాత 1980ల నాటికి ఎంజీ రామచంద్రన్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను 31 శాతం నుంచి 50 శాతానికి పెంచడం జరిగింది. దీంతో బీసీ, ఎస్సీ, ఎస్టీల మొత్తం రిజర్వేషన్ల శాతం 68 శాతానికి చేరింది. ఆ తర్వాత 1989లో డీఎంకే ప్రభుత్వం గిరిజనులకు ప్రత్యేకంగా మరో 1 శాతం రిజర్వేషన్‌ను పెంచుతూ నిర్ణయం తీసుకుంది .( అంతకు ముందు ఎస్సీ,ఎస్టీలకు కలిపి రిజర్వేషన్లు ఉండేవి) ఇలా తమిళనాడులో రిజర్వేషన్ శాతం 69 శాతానికి చేరింది.అప్పటి వరకు 69 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోన్న తమిళనాడు ప్రభుత్వానికి, 1992లో ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (మండల్ కేసు) లో సుప్రీం కోర్టు చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. అరుదైన, అసాధారణ పరిస్థితుల్లో తప్ప దేశంలో రిజర్వేషన్లు 50 శాతం దాటరాదని తీర్పులో పేర్కొంది. ఇది తమిళనాడులో అప్పటికే అమలు అవుతున్న 69 శాతం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉంది. అయితే, 69 శాతం రిజర్వేషన్లను యథావిధిగా అమలు చేసేందుకు తమిళనాడు రాజకీయ నేతలు రాజకీయ చతురతను ప్రదర్శించారు. నాటి తమిళనాడు సీఎం జయలలిత వ్యూహాత్మకమైన తీరులో వ్యవహరించింది.

ఇందిరా సాహ్నీ కేసు తీర్పుతో తమిళనాడు రిజర్వేషన్లు ప్రమాదంలో పడ్డాయి. దీంతో జయలలిత ప్రభుత్వం తమిళనాడు రిజర్వేషన్ చట్టాన్ని తెచ్చింది. 1994 తమిళనాడు శాసన సభలో చట్టం 45 ను ఆమోదించింది. ఈ చట్టం రాష్ట్రంలోని విద్య, ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు 69 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నది ప్రధాన లక్ష్యం. ఆ తర్వాత 69 శాతం రిజర్వేషన్ల అమలుకు రాజ్యాంగ రక్షణ కల్పించే దిశగా అడుగులు వేసింది. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో 69 శాతం రిజర్వేషన్ల అమలును జయలలిత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సాయంతో చేర్పించగలిగింది. ఇందుకు 1994లో 76వ రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో 69 శాతం తమిళనాడు రిజర్వేషన్ల అంశాన్ని చేర్చడం జరిగింది. ఈ షెడ్యూల్‌లో చేరిన చట్టాలపై న్యాయస్థానాలు సమీక్షించలేవు. ఇలా తమిళనాడు రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించబడింది. ఈ కారణంగా, రిజర్వేషన్లు 50 శాతం పరిమితి దాటకూడదని సుప్రీం తీర్పు ఇచ్చినప్పటికీ, తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి.రాజకీయ బేరసారాలు: ఈ రాజ్యాంగ సవరణను చేయించడానికి అప్పటి ముఖ్యమంత్రి జయలలిత, కేంద్రంలో పీవీ నరసింహారావు నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై గట్టి రాజకీయ ఒత్తిడి తీసుకొచ్చారు. తమిళనాడులో కాంగ్రెస్‌ఏఐఏడీఎంకే కూటమి బలమైనదికావడంతో, ఈ రాజ్యాంగ సవరణకు అప్పటి కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇవ్వక తప్పలేదు. రాజకీయ అనివార్యత కారణంగానే 1994లో 76వ రాజ్యాంగ సవరణ చేసి తమిళనాడు రిజర్వేషన్ చట్టం ను 9వ షెడ్యూల్‌లో చేర్చడం జరిగింది.జయలలిత ఒత్తిడికి తలొగ్గిన పీవీ: 1991లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అన్నాడీఎంకే తమిళనాడులో పొత్తు పెట్టుకుని అద్భుత ఫలితాలను సాధించాయి. ఆ సమయంలో ప్రధానిగా ఉన్న పీవీ నరసింహారావు పార్లమెంట్‌లో తన ప్రభుత్వ మెజార్టీ కోసం అన్నాడీఎంకే మద్దతుపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. ఏ మాత్రం జయలలిత కినుక వహించినా పీవీ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయే పరిస్థితి. ఈ కారణంతో తమిళనాడు రిజర్వేషన్ చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని జయలలిత పీవీపై తీవ్ర ఒత్తిడి తెచ్చింది. ఈ కారణంతో పీవీ నరసింహారావు ప్రభుత్వం జయలలిత ఒత్తిడి మేరకు తమిళనాడు రిజర్వేషన్ల చట్టానికి 9వ షెడ్యూల్‌లో చేర్చడం ద్వారా రాజ్యాంగ రక్షణ కల్పించింది. అంతే కాకుండా, తమిళనాడు ద్రవిడ ఉద్యమంతో ముడిపడి ఉన్న రిజర్వేషన్ విధానం. ఇది చాలా కాలం నుంచి అమల్లో ఉంది. దీనికి వ్యతిరేకంగా ఏం జరిగినా ఆ రాష్ట్రంలో పెద్ద స్థాయిలో ఉద్యమం చెలరేగవచ్చు అన్న భావనతో కేంద్రం తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్ల చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చక తప్పలేదు.




## లాభాలతో స్టాక్ మార్కెట్లు

**జయభేరి, ముంబై, అక్టోబరు 10 :**

స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు శుక్రవారం కూడా లాభాలతో ముగిశాయి. ఫార్మా, బ్యాంకింగ్ రంగాల షేర్లలో బలమైన కొనుగోళ్లు జరగడంతో పాటు ఆటో, ఎనర్జీ షేర్లు కూడా రాణించడంతో సూచీలు లాభపడ్డాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 329 పాయింట్లు లాభపడి 82,501 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 104 పాయింట్లు పెరిగి 25,285 వద్ద ముగిసింది.ఈ ఉదయం ట్రేడింగ్ బలహీనంగా ప్రారంభమైంది. ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడితో సెన్సెక్స్ దాదాపు 100 పాయింట్లు నష్టపోయి 82,075 వద్ద మొదలైంది. అయితే, కొద్దిసేపటికే కోలుకుని ఇంట్రాడేలో 579 పాయింట్ల వరకు లాభపడి 82,654 గరిష్ఠ స్థాయిని తాకింది. నిఫ్టీ కూడా ట్రేడింగ్ సమయంలో 25,331 గరిష్ఠాన్ని నమోదు చేసింది.సెన్సెక్స్ ప్రధాన షేర్లలో ఎస్‌బీఐ 2 శాతానికి పైగా లాభపడగా, మారుతీ సుజుకి, యాక్సిస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, పవర్ గ్రిడ్ షేర్లు ఒక శాతానికి పైగా లాభపడ్డాయి. మరోవైపు, టాటా స్టీల్ 1.5 శాతం నష్టపోగా, రెండో త్రైమాసిక ఫలితాల తర్వాత టీసీఎస్ షేరు సుమారు 1 శాతం క్షీణించింది.రంగాల వారీగా చూస్తే, బీఎస్ఈ హెల్త్‌కేర్, బ్యాంకెక్స్ సూచీలు ఒక శాతం వరకు లాభపడ్డాయి. ఆటో, క్యాపిటల్ గూడ్స్ సూచీలు అరశాతం మేర పెరిగాయి. ఇక బ్రాడర్ మార్కెట్‌లో బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.4 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.6 శాతం మేర లాభపడ్డాయి. మరోవైపు, భారత్, యూకే మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 2030 నాటికి రెట్టింపు కావచ్చన్న వార్తలతో టెక్స్‌టైల్ కంపెనీల షేర్లు ఇంట్రాడేలో 17 శాతం వరకు దూసుకుపోయాయి. 1మెరికాతో వాణిజ్య ఒప్పందంపై సానుకూల అంచనాలు, మధ్యప్రాచ్యంలో భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గడం వంటి అంతర్జాతీయ అంశాలు ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని పెంచాయని విశ్లేషకులు తెలిపారు. పండుగ సీజన్ ప్రారంభంలో జీఎస్టీ సంస్కరణల కారణంగా వినియోగం పెరగడం, ఆర్‌బీఐ తీసుకుంటున్న చర్యలతో దేశీయ ఆర్థిక సూచికలు మెరుగుపడటం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచాయని నిపుణులు అభిప్రాయపడ్డారు. సాంకేతికంగా నిఫ్టీ రానున్న రోజుల్లో 25,500 25,550 స్థాయిలకు చేరే అవకాశం ఉందని, 25,150 వద్ద మద్దతు లభిస్తుందని వారు అంచనా వేశారు.

## బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ హైకోర్టు స్టే..!

- తొందరపడి అభ్యర్థులు తప్పటడుగు వేయకండి.
- హైకోర్టు న్యాయవాది ఆర్కే..

**జయభేరి, హైదరాబాద్:**



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన పంచాయతీరాజ్ (సవరణ) చట్టం - 2025 ప్రకారం, రాష్ట్ర వ్యాప్తంగా బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తూ GO No.9 విడుదల చేసింది. ఈ రిజర్వేషన్‌కి ఆధారంగా ప్రభుత్వం 2025 కులగణన డేటాను చూపించింది. అయితే, ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ అగ్రవర్ణాలకు చెందిన మాధవరెడ్డి అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై ఇటీవల వాదనలు జరిగాయి. ఆ వాదనలకు కోర్టులో ప్రత్యక్షంగా హైకోర్టు న్యాయవాది ఆర్కే హాజరయ్యారు, ఇరు పక్షాల వాదనలను స్వయంగా విన్నారు. అందువల్లనే ఆ రోజే చెప్పాను హైకోర్టు నుంచి స్టే వచ్చే అవకాశం ఉందని. నేడు అదే జరిగింది తన అభిప్రాయాన్ని జయభేరి మీడియా ముఖంగా తెలియజేశారు. నిజానికి పిటిషనర్ వాదన ఎలా సాగిందో వివరిస్తూ.. పిటిషనర్ వాదన:

పిటిషనర్ తరపున వాదనలు వినిపిస్తూ, ఇంద్ర సహాని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (మండల్ కమిషన్ కేస్) తీర్పును ఉదహరిస్తూ, రాజకీయ రిజర్వేషన్లలో వర్గీకరణ మరియు మొత్తం రిజర్వేషన్లు 50% మించ కూడదని పేర్కొన్నారు. అందువల్ల 42% బీసీ రిజర్వేషన్ ఇవ్వడం చట్ట విరుద్ధమని వాదించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం తరపున వాదనను వినిపించారు. ఇక రాష్ట్ర ప్రభుత్వ వాదన:

రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ సుప్రీం కోర్టు న్యాయవాది అభిషేక్ మను షెంగ్వి వాదిస్తూ, ఇంద్ర సహాని తీర్పు విద్యా మరియు ఉద్యోగ రిజర్వేషన్లకు మాత్రమే వర్తిస్తుందని, రాజకీయ రిజర్వేషన్లకు వర్తించదని స్పష్టం చేశారు. అలాగే, రాజ్యాంగంలో ఎక్కడా 50% సీలింగ్ గురించి ప్రస్తావన లేదు, అది కేవలం సుప్రీం కోర్టు తీర్పులో( కే . కృష్ణ మూర్తి vs స్టేట్ ఆఫ్ ఇండియా) ఆదరంగా మాత్రమే 50% రిజర్వేషన్ లు సీలింగ్ దాట కూడదు అని చెప్పారు. ఇరువురి వాదనలు విన్న తర్వాత న్యాయపరమైన లోపాలు ఏంటో తెలియజేస్తూ..

రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టం రూపొందించే సమయంలో కొన్ని ముఖ్యమైన న్యాయపరమైన చర్యలను తప్పించింది. ముఖ్యంగా పాత పంచాయతీరాజ్ చట్టాన్ని సవరిస్తూ తీసుకొచ్చిన బిల్లుకు గవర్నర్ ఆమోదం పొందకుండా కొత్త చట్టం, కొత్త జీవో (No.9) జారీ చేయడం రాజ్యాంగ విరుద్ధం. కాబట్టి ఈ చట్టం కోర్టులో నిలబడే అవకాశం చాలా తక్కువ. ఇప్పుడు హైకోర్టు ఇచ్చిన స్టే తర్వాత, తదుపరి దశలో పిటిషనర్ గెలిస్తే ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్తుంది. ప్రభుత్వం గెలిస్తే పిటిషనర్ సుప్రీంకోర్టుకు వెళ్తాడు. ఏ దిశలోనైనా ఈ అంశం సుప్రీంకోర్టు పరిధిలోకి వెళ్లడం ఖాయం. ఇక ప్రస్తుతం ప్రభుత్వం ముందున్న సరైన మార్గం:

బీసీలకు 42% రిజర్వేషన్ న్యాయబద్ధంగా అమలు చేయాలంటే ప్రభుత్వం తప్పనిసరిగా.

1. పంచాయతీరాజ్ చట్టం సవరణ బిల్లును గవర్నర్ ఆమోదం పొందాలి.
2. Triple Test ప్రకారం (కులగణన డేటా, శాసనసభ తీర్మానం, గవర్నర్ ఆమోదం) అన్ని ప్రక్రియలు పూర్తి చేయాలి.
3. ఆ తరువాతే కొత్త చట్టం సంపూర్ణంగా అమల్లోకి వస్తుంది.

లేదా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్త శుద్ధి ఉంటే దేశం మొత్తం కులగణన చేసి బీసీ లకు శాశ్వత పరిష్కారం పార్లమెంట్ ద్వారా చెయ్యచ్చు. ఆర్టికల్ 340 Dను సవరించి బీసీ లకు దేశం మొత్తం 42% విద్యా ఉద్యోగ రాజకీయ రిజర్వేషన్లు అమలు చేస్తూ నూతన చట్టాన్ని పార్లమెంట్ ద్వారా తయారు చేస్తూ 9th షెడ్యుల్ లో పొందు పరచాలి. ఈ మార్గం రాష్ట్ర ప్రభుత్వానికి బాగా తెలిసిన విషయమే. అయినప్పటికీ, రాజకీయ ప్రయోజనాల కోసం ఈ GO ను తీసు కొచ్చినట్లు రాజకీయాలు తెలిసినవారికి అర్థమైపోతుంది. ఇక హైకోర్టు న్యాయవాది ఆర్కే తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ.. ఇప్పుడే ఎన్నికల వాతావరణంలో ఉన్న అభ్యర్థులు, ఆశావాహులు తొందరపడి డబ్బు ఖర్చు చేయకండి. చట్టపరంగా ఇంకా స్పష్టత రాలేదు. ఆవేశంతో నిర్ణయాలు తీసుకుంటే ఆర్థికంగా, కుటుంబ పరంగా నష్టపోవచ్చు.అందుకే జాగ్రత్తగాఅడుగు వెయ్యండి అంటూ హైకోర్టు న్యాయవాది ఆర్కే(900040361) తన అభిప్రాయాన్ని మీడియా ముఖంగా తెలియజేశారు.

# దీపావళి బాణాసంచా విక్రయించాడానికి అనుమతులు తప్పనిసరి

■ అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

జయభేరి, అనకాపల్లి :



దీపావళి పండుగతో పాటు ఇతర వేడుకల సందర్భంగా బాణాసంచా తయారీ, నిల్వ, విక్రయం వంటి కార్యకలాపాలు నిర్వహించే వారు ప్రభుత్వ నిబంధనలు మరియు అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలి అని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఇటీవల జిల్లాలోని కోటవురట్ల మండలం, కైలాసపట్నం గ్రామం, కోనసీమ జిల్లా, రాయవరం మండలం, వి.సవరం గ్రామంలో చోటుచేసుకున్న ప్రమాదకర ఘటనలను దృష్టిలో ఉంచుకుని, ప్రజల ప్రాణ భద్రత కోసం బాణాసంచా తయారీ మరియు నిల్వ కేంద్రాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. అనుమతులు లేకుండా లేదా భద్రతా ప్రమాణాలు పాటించకుండా బాణాసంచా తయారు చేయడం, నిల్వ చేయడం లేదా విక్రయించడం పూర్తిగా నిషేధం అని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని బాణాసంచా గోదాములు, తయారీ కేంద్రాలు మరియు విక్రయ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు కొనసాగుతున్నాయని అన్నారు. భద్రతా ప్రమాణాలు ఉల్లంఘించినా, ఫైర్ సేఫ్టీ పరికరాలు లేకుండా లేదా తగిన భద్రతా సిబ్బంది లేకుండా బాణాసంచా నిల్వ లేదా తయారీ జరిగితే, సంబంధితులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో అనధికారిక బాణాసంచా తయారీ, నిల్వ లేదా విక్రయం జరుగుతున్నట్లు గమనించిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112 నంబర్‌కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యం అని ప్రజల సహకారమే తమ బలం అని అన్నారు.బాణాసంచా ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం అని ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు.



## గ్రూప్ 1 విజేతను సన్మానించిన ఎమ్మెల్యే

జయభేరి, కాప్రా:

చర్లపల్లి డివిజన్ పరిధిలోని చక్రీపురం నాగార్జున కాలనీ కి చెందిన దరవత్ సబితా ఇటీవల విడుదల అయిన గ్రూప్ 1 ఫలితాల్లో 303 ర్యాంక్ సాధించి DSPగా ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వారి నివాసానికి Dr AS Rao Nagar డివిజన్ కార్పొరేటర్ శిరీష సోమ శేఖర్ రెడ్డితో కలిసి వెళ్ళి వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివి గ్రూప్ 1 ఫలితాల్లో DSP గా నియమితులైన సబితా గారిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలి అని ఈమె విజయం బంజారా జాతి కే గర్వకారణం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి BRS పార్టీ నాయకులు శివ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## నేరం చేయకపోతే బెయిలు కోసం అర్జీ ఎందుకు..!?

■ దిగంబరకామ్లే నువ్వు సత్యవంతుడు అయితే పోలీసులకు లొంగిపో..!?

జయభేరి, తార్నాక :

తెలంగాణ రాష్ట్రంలో మహిళలపై అరాచకాలు జరుగుతున్న దళిత సంఘాలు నోరు మెదపకపోవడం సోషల్ మీడియాలో మాట్లాడకపోవడం చాలా బాధాకరమని విచారణ వ్యక్తం చేశారు దిశా మహిళ సేవా సమితి అధ్యక్షురాలు కే ఇందిర కృపాకర్.. ఈ సందర్భంగా ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ మైనర్ బాలికపై ఎన్ 9 మీడియా యజమాని అత్యాచారం జరపడం పోలీస్ స్టేషన్లో జీరో ఫోక్ షో కేసు నమోదు అవ్వడం మేజిస్ట్రేట్ అమ్మాయి వాంగ్మూలాన్ని రికార్డు చేయడం ఇదంతా జరిగిన నిందితుడు దిగంబర్ కామ్లే మాత్రం పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతూ బెయిల్ కోసం ప్రయత్నం చేయటం సిగ్గుచేటు అని ఘాటుగా విమర్శించారు. నిజానికి తప్పు చేయని వాడైతే పోలీసులకు లొంగిపోయి తన వాంగ్మూలాన్ని మేజిస్ట్రేట్ గారికి చెప్పాలి అంతే కానీ అలా చేయకుండా బెయిల్ కోసం సంబంధిత పోలీస్ స్టేషన్లోనే అర్జీ పెట్టడం అతను కచ్చితంగా మైనర్ బాలికపై అఘాయిత్యం చేశాడని నమ్మడం సత్యమని ఆమె మరొకసారి పునరుద్ఘాటించారు.. దీనిపై తెలంగాణ రాష్ట్ర దిశా మహిళా సేవా సమితి అధ్యక్షురాలుగా భారీ ఎత్తున రాబోయే రోజుల్లో దళిత మైనర్ బాలికల పట్ల వివక్షత అత్యాచారం అరాచకం ఇలాంటివి జరగకుండా పోరాటం చేస్తామని ఘాటుగా హెచ్చరించారు. కచ్చితంగా త్వరలోనే నిందితుని పట్టుకొని చట్టపరంగా శిక్షించాలని ఆమె పోలీసు వారిని కోరారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా

■ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

■ వ్యక్తిగత ప్రమాద బీమా బాండ్ల పంపిణీ

జయభేరి, కాప్రా:



జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం టీఎస్ఐఐసి కాలనీలోని కాప్రా ప్రెస్ క్లబ్ కార్యాలయంలో చేపట్టిన వ్యక్తిగత ప్రమాద బీమా బాండ్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలన్నారు. వార్త సేకరణలో పాత్రికేయులు తమ ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా బాధ్యతలు నిర్వహిస్తూ సమాజానికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నారన్నారు. అయితే విలువలతో పనిచేసిన జర్నలిస్టులకు ఎప్పుడు గుర్తింపు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టులు అన్యాయాన్ని ఎదిరించి పేద ప్రజలకు అండగా ఉండాలని ఆయన సూచించారు. కాప్రా ప్రెస్ క్లబ్ సభ్యులకు వ్యక్తిగత ప్రమాద బీమాను చేయించిన స్థానిక నాయకుడు, పాండాల శివ కుమార్ గౌడ్ ను, అలాగే జర్నలిస్టుల సంక్షేమ నిధికి సహకారాన్ని అందజేసిన మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, స్థానిక నాయకులు రాఘవరెడ్డి, వంజరి ప్రవీణ్ కరిపే, సంఘ సేవకులు బండే గౌడ లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కాప్రా ప్రెస్ క్లబ్ జర్నలిస్టులకు ఎమ్మెల్యే బండారి చేతుల మీదుగా బాండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు మోతే వెంకటరెడ్డి, మల్కయ్య, పాంజాల శ్రీనివాస్ గౌడ్, కేసి మోహన్, సత్యనారాయణ, సహదేవ చారి, జ్యోతిర్మయ చారి, చంద్రమౌళి, కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి ఉల్లోజు శ్రీనివాస్, వేముల శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, కోశాధికారి రుద్రగోని నర్సింగ్ గౌడ్, ఉపాధ్యక్షులు ఆదిమూలం శ్రీనివాస్, నటరాజ్, అక్బర్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు శనిగరం అశోక్, జర్నలిస్టులు సాంబశివ, బసంత్ రెడ్డి, బాల్రెడ్డి, బాల్రాజ్ గౌడ్, సీర శ్రీనివాస్, పవన్, ప్రశాంత్, ప్రభాకర్ రెడ్డి, చుక్క రమేష్, దాచారం రమేష్, నోముల రమేష్ యాదవ్, సత్యనారాయణ, మైసయ్య, బాలకృష్ణ, దాసారం శ్రీనివాస్, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## తుర్కపల్లి మండలంలో బంద్ విజయవంతం



జయభేరి, తుర్కపల్లి, అక్టోబర్ 10:

తుర్కపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యకర్తలు, బీసీ సంఘం నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ గౌరవాధ్యక్షుడు పనగట్ల రాజనర్సయ్య మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెంబర్ 9 ని బలహీనంగా రూపొందించిందని ఆరోపిస్తూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ బందు పిలుపునిచ్చిందని అట్టి బంద్ ను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో చెల్లదంటూ కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న ఎవరు బీసీలను మోసం చేసిన ప్రభుత్వంపై బంద్ నిర్వహణకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు కోడూరు కొమరయ్య, పగిడిపల్లి నరేష్, మహదేవుని శ్రీనివాస్ ,చింతపండు చంద్రమౌళి, గంధం నాగరాజు, లోకుల రవి ,పనిగట్ల లక్ష్మణ్ ,తునికి కృష్ణ, పాముల వెంకటేష్, భూసాని వెంకటేష్, పనిగట్ల సుభాష్, గ్రామ యూత్ అధ్యక్షుడు సిద్దంకి మురళి, కుమ్మ అశోక్, ఇటుక పల్లి బాల శంకర్ ,సోషల్ మీడియా కన్వీనర్లు దొంతుల సతీష్, మహమ్మద్ సర్వర్ పాషా, రావుల వెంకటేష్ పాల్గొన్నారు.

# హైకోర్టు ఎలక్షన్ వాయిదా వేయడాన్ని నల్ల బ్యాడ్జ్ లతో నిరసన

జయభేరి, దేవరకొండ :



జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలో ఎలక్షన్ లను హైకోర్టు నాలుగు వారాలు వాయిదా వేస్తూ స్టే ఇవ్వడం నిరసిస్తూ శాంతియుత ర్యాలీ ఏర్పాటు చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నల్ల బ్యాడ్జిల్లాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రావడానికి స్థానిక సంస్థల ఎలక్షన్ లో 42% బీసీ రిజర్వేషన్ను ఏర్పాటు చేస్తామని చెప్పి,ఆర్డినెన్స్ జీవోను ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదల చేసి, తమ సామాజిక వర్గం నాయకులతో హైకోర్టు,సుప్రీంకోర్టులలో కేసులు వేసి మరోసారి బీసీలకు నమ్మకద్రోహం చేశారని, చిత్తశుద్ధి ఉంటే మీ సామాజిక వర్గం నాయకుల తోటి మీరు సంప్రదించి కోర్టులో ఉన్నటువంటి కేసులను విరమింప చేసుకోవాలని 42 శాతం రిజర్వేషన్ను అమలు అయ్యే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. లేని యెడల బీసీ సమాజం మొత్తం ఐక్యమై ఉద్యమించి మాకు కావలసినటువంటి మా రిజర్వేషన్ను జనాభా ప్రాతిపదికన పొందే వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చోళ్ళేటి భాస్కర చారి, V. ఆర్మీ శ్రీను, రెడ్డి కోటేశ్వరరావు, కూరెళ్ళ కృష్ణమాచారి, పతలావత్ లక్ష్మణ నాయక్, నల్ల గ్లాసు కృష్ణ యాదవ్, రెడ్డి యాదయ్య, గడిగే అర్జున్, అప్పం వీరయ్య, గడ్డం బిక్షమయ్య,దామెర శాంసన్,తోటుపల్లి శ్రీను, భీమగొని శివగౌడ్, పల్స శ్రీనివాస్ గౌడ్, మేదర సంఘం వెంకటయ్య, పెరికేటి శ్రీనివాసాచారి, కృష్ణ ప్రసాద్, జ్యోతిబాసు బీసీ సంఘానికి మద్దతుగా జనసేన పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ చందు నాయక్, ఆల్ ఇండియా సమత సైనిక్ దళ్ నియోజకవర్గ అధ్యక్షులు జిల్లా రాములు వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## హైకోర్టు స్టే బీసీలకు తీరని అన్యాయం

■ కళ్లెం కృష్ణ



జయభేరి, యాదగిరిగుట్ట, అక్టోబర్ 10:

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి జీవో 9 పై హైకోర్టు స్టే ఇవ్వడంతో బీసీలకు తీరని అన్యాయం చేసినట్టయిందని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కళ్లెం కృష్ణ తెలిపారు. శుక్రవారం యాదగిరిగుట్ట పట్టణంలో బీసీ హక్కుల సాధన సమితి ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఆరు వారాల పాటు కౌంటర్ కు స్టే ఇవ్వడం ఎందుకని ప్రశ్నించారు. రిజర్వేషన్లు అమలు చేయడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తి విఫలమైందని,బీసీలకు తరతరాలుగా అన్యాయం జరుగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సంఘాలు సమైక్యంగా పోరాడి రిజర్వేషన్లు సాధించుకోవాలని, ఉద్యమాన్ని ఉదృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మహేందర్, నేతలు పాకాలపాటి రాజు, అనంతుల నర్సింహ్మా, గుండ్లపల్లి మహేష్,క్రాంతి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్ లో కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ



జయభేరి, మేడ్చల్:

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లో బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి మీడియాతో మాట్లాడారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లో మాజీ మంత్రి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆదేశాలతో ఇంటింటికి కాంగ్రెస్ బాకీ కార్డు ను బిఆర్ఎస్ శ్రేణులు ఇవ్వనున్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, గత 22 నెలలుగా రైతులను, విద్యార్థులను, యువకులను,మహిళలను, ప్రజలను మోసం చేస్తూ హామీలను అమలు చేయకుండా కాలం వెల్లదీస్తుందని అన్నారు. కాంగ్రెస్ నాయకులు ఓటు అడగడానికి వస్తే ఈ బాకీ కార్డు చూపించి కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించాలని మంద సంజీవరెడ్డి అన్నారు..

## రాజస్థాన్ కు చెందిన ఇద్దరు డ్రగ్ పెడ్లర్స్ అరెస్టు

■ సీపీ సుధీర్ బాబు, రాచకొండ

జయభేరి, హైదరాబాద్:




రాష్ట్రాన్ని డ్రగ్ ఫ్రీ తెలంగాణగా చేయాలని ప్రభుత్వం పోలీస్ శాఖకు సూచించింది. అందులో భాగంగా విశేషమైన ఎఫర్ట్స్ పెట్టి డ్రగ్స్ కట్టడి కోసం ప్రయత్నిస్తున్నామని రాచకొండ సీపీ సుధీర్ బాబు అన్నారు. ఇప్పటివరకు రాచకొండ కమిషనరేట్లో 403 మంది డ్రగ్ పెడ్లర్లు, సరఫరాదారులు, విక్రయదారులను అరెస్టు చేశాం. ఇతర రాష్ట్రాల్లో ఉండి డ్రగ్ ముఠాలను నడిపించే కొంత మంది నేరస్తులను మా బృందాలను పంపించి అరెస్టు చేశాం. ఇప్పుడు రాజస్థాన్ కు చెందిన ఇద్దరి ముఠా నడిపిస్తున్న డ్రగ్ రాకెట్ ను ఛేదించాం. రాజస్థాన్ కు చెందిన లోకేష్ భరత్ అనే నిందితుడి నుంచి కోటి రూపాయలు విలువ చేసే 7 కేజీల ఓపియం, 2 కేజీల పాపిస్ట్రా స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నిందితుడ్ని కుందన్ పల్లి ఓఆర్ఆర్ దగ్గర పట్టుకున్నాం. పరారీలో ఉన్న మరో నిందితుడు రాజస్థాన్ కు చెందిన జగదీష్ గుజ్జర్ కోసం గాలిస్తున్నాం. నిందితుడు లోకేష్ భరత్ ఆగస్టులో 2 కేజీల ఓపియం కాచిగూడ రైల్వే స్టేషన్ దగ్గర విక్రయించాడు. నిందితుడు లోకేష్ భరత్ హోటల్ లో మేనేజర్ గా పని చేసేవాడు. అతను పని చేసే హోటల్ మూసెయ్యడంతో ఉద్యోగం పోయింది. అప్పటి నుంచి ఈజీ మనీకి అలవాటు పడ్డాడు . జగదీష్ గుజ్జర్ సాయంతో ఈ దందాలోకి దిగాడని అన్నారు.

## సౌకర్యాలు మెరుగుపరచాలి



జయభేరి, గార్ల, అక్టోబర్ 10:

మహబూబాబాద్ జిల్లా,గార్ల రైల్వే స్టేషన్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి ,సౌకర్యాలు మెరుగుపరచాలని మండల రైల్వే ప్రయాణికుల కమిటీ నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని రైల్వే డిఆర్ఎం కే.గోపాలకృష్ణన్, ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ నిర్మల నరసింహన్ రాజారాంలకు శుక్రవారం గార్ల లో అందజేశారు.ఈ సందర్భంగా రైల్వే ప్రయాణికుల కమిటీ సభ్యులు మాట్లాడుతూ, రైల్వే స్టేషన్ లో ఫ్లాట్ ఫామ్ స్థలం చాలా పరిమితంగా ఉండడంతో ఫ్లాట్ పొడవును, కనీసం ఒకటి లేదా రెండు అదనపు ఫ్లాట్ ఫామ్ లుగా నిర్మించాలని కోరారు. అసంపూర్తిగా ఉండి, మధ్యలో వదిలేసిన అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ను సందర్శించి త్వరితగతిన పూర్తి చేయాలని, రాంపురం గ్రామానికి వెళ్లేందుకు ప్రజల సౌకర్యార్థం బ్రిడ్జి మంజూరు అయినందున అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రద్దు కాబడిన నాగ్పూర్ ప్యాసింజర్ ను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కందునూరి ఈశ్వర్ లింగం, పానుగంటి రాధాకృష్ణ, మృదులాకర్ శివాజీ, ఏసు మల్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# నాడు తుపాకీ పట్టి దొరలను ఎదిరించాం..!

- నేడు అక్రమదారుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ చేతిలో మోస పోయాం
- పునరావాసం కింద ఇచ్చిన ఇళ్ల స్థలాలను చిలుకానగర్ కార్పొరేటర్ భర్త కబ్జా చేశాడు
- ఉప్పల్ లో మాజీ నక్సల్స్ ఆవేదన

జయభేరి, ఉప్పల్ :

నాడు దొరలకు, పెత్తందారులకు వ్యతిరేకంగా తుపాకీ బట్టి నక్సలైట్లుగా ఉద్యమం చేశాం. ఎంతోమంది పేదలకు న్యాయం చేశాం. కానీ నేడు మహానగరంలో మాయగాడి చేతిలో మోసపోయి గోసబడుతున్నామని పలువురు మాజీ నక్సలైట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలువురు మాజీ నక్సలైట్లకు ఉప్పల్ లోని హైకోర్టు కాలనీ సమీపంలో వెయ్యి గజాల ఇంటి స్థలాలను 2003లో తెదేపా గవర్నమెంట్ హోం మంత్రి దేవేంద్ర గౌడ్ సమక్షంలో ఇవ్వడం జరిగింది. అప్పటినుంచి వారి స్వాధీనంలోనే ఇంటి స్థలాలు ఉన్నాయి. ఇటీవల చిలుకానగర్ కార్పొరేటర్ భర్త బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తమ ఇంటి స్థలాలను కబ్జా చేసి నిర్మాణాలను చేస్తూ తమను తీవ్రమైన ఇబ్బందులకు గురి చేస్తున్నట్లుగా ఆరోపించారు. భూ కబ్జాదారుడు, ఆక్రమణదారుడైన బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తో తమకు ప్రాణాన్ని కూడా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సీఎం రేవంత్ రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు స్పందించి తమకు న్యాయం చేసే విధంగా సహకరించాలని కోరుతున్నారు. తమ ప్లాట్ లను కబ్జా చేసి నిర్మాణాలు చేస్తున్న బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పై 420, ఇతర సెక్షన్ల కింద కేసులో నమోదు చేసి,వెంటనే అరెస్టు చేసి, తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

# గోషామహల్ ఎమ్మెల్యే రాజసింగ్ పై కఠినచర్యలు తీసుకోవాలి



జయభేరి, దేవరకొండ :

మహ్మద్ ప్రవక్త పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసి ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది ముస్లింల మనోభావాలు గాయపరచిన గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజసింగ్ పై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జమియత్ ఏ ఉలేమా, ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలో స్థానిక సిఐ పి వెంకట్ రెడ్డి కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మత పెద్ద ముఫ్తి జావిద్ హుస్సేన్ మాట్లాడుతూ.. భారత దేశం శాంతికి చిహ్నం లాంటిదని, మత సామరస్యానికి నిలయం అని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసం మత చిచ్చు పెట్టి, తాత్కాలిక ప్రయోజనాలు పొందొచ్చు తప్ప అవి శాశ్వతంగా ఉండవన్నారు.మహ్మద్ ప్రవక్త పై అనుచిత వ్యాఖ్యలు మమ్ములను బాదించాయని, ఈ వ్యాఖ్యలు బేషరతుగా ఉపసంహరించుకోవాలని, అదేవిధంగా ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారిపై కఠినాతి కఠినమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అందులో భాగంగానే దేవరకొండ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జామియాత్ ఏ ఉలేమా అధ్యక్షులు ముఫ్తి జావీద్ హుస్సేన్ ఖాస్మీ, ఈద్గా కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజీమోద్దీన్, ఇస్లాయే ముఆశరా కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ ఖాజమైనుద్దీన్, ఇలియాస్ పటేల్, అలీముద్దీన్, కామాల్, అతీఖ్, జాఫర్, సైఫ్, ఇలియాస్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

# బీసీలను మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ కోకన్వినర్



జయభేరి, చర్ల, అక్టోబర్ 10 :

బీసీలను మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు స్థానిక ఎన్నికలో 42 శాతం ఇచ్చినట్లు నటించి బీసీలను మోసం చేసారని, బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు, కో కన్వీనర్ ఐనవోలు పవన్, బీసీ సెల్ అధ్యక్షుడు గోరంట్ల వెంకటేశ్వరావు, ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు 42 శాతం డ్రామాను మంత్రులు బాగా నటించారని, బీసీల ఓట్లల కోసం ఇది కోర్టులో నిలబడదని తెలసికూడ హడావుడిగా జీవో తీసుకొచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం అనుకున్నట్లే కోర్టు స్టే ఇచ్చిందని, బీసీల ఆత్మ గౌరంతో ఆడుకొంటున్నారని అన్నారు. బీసీలకు 42 శాతం అమలు చేసే భాద్యత కాంగ్రెస్ పార్టీదేనని, సాధ్యం కాని హామీలు ఇచ్చి మోసం చేయడమే కాంగ్రెస్ నైజాం అని, రాష్ట్రంలో అన్ని వర్గాల వారిని మోసం చేస్తుందని, ఉద్యోగులను, అంగన్వాడీ టీచర్లలను, రైతులను, మహిళలను, చేనేత కార్మికులను , ఆటోడ్రైవలను, నిరుద్యోగులను ఇలా అన్ని వర్గాల వారిని ప్రజలను మోసం చేసారని అన్నారు. ఇప్పుడు బీసీలను మోసం చేయటమే కాక రాష్ట్రంలో బీసీలు 80 శాతం ఉన్నారని, బీసీలు ఆలోచన చేస్తే ప్రభుత్వం ఆగదు, ఎలక్షన్స్ పెడితే ఓడి పోతారని, ప్రజలు కాంగ్రెస్ పార్టీపై వెతిరేకత ఉందని, స్థానిక ఎన్నికలు జరగకుండా ఉండటానికి చేసిన డ్రామా అన్నారు. బీసీలకు నిజంగా న్యాయం చేయానికుంటే కోర్టులో కేసు ఉండేది కాదు స్టే ఉండేదు కాదని అన్నారు.

# త్రిశంకు స్వర్గంలో గ్రూప్ వన్ అభ్యర్థులు

జయభేరి, హైదరాబాద్, అక్టోబరు 10:



గ్రూప్ 1కు ఎంపికకాని అభ్యర్థులు, ఇప్పటికే అపాయింట్ మెంట్ ఆర్డర్లు అందుకున్న గ్రూప్ 1 ఉద్యోగులు త్రిశంకు స్వర్గంలో ఉన్న పరిస్థితి నెలకొన్నది. తమకు ఉద్యోగం వస్తుందని కొందరు భావిస్తుంటే.. తమ ఉద్యోగాలు ఉంటయా? లేక ఊడుతాయా? అని అపాయింట్ మెంట్ ఆర్డర్లు అందుకున్న మరి కొందరు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.గ్రూప్ 1 నియామకాలను నిలిపివేయా లని కొందరు గ్రూప్ 1 అభ్యర్థులు ఇటీవల వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు మంగళవారం డిస్పోజ్ చేయడంతో హమ్మయ్య అని ప్రస్తుతానికి ఊపిరి పీల్చుకున్నా, హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చే తుది తీర్పుకు లోబడే వారి నియామకాలు ఉంటాయని సుప్రీం కోర్టు స్పష్టం చేయడం గమనార్హం.అంటే అపాయింట్ మెంట్ లు తీసుకున్నా ఉద్యోగాలు ఉండొచ్చు.. లేకుంటే ఊడొచ్చునని అభ్యర్థులు చెబుతున్నారు. ఉద్యోగాలు రానివారు, ఉద్యోగాలు వచ్చినవారు.. ఇలా రెండు వర్గాలుగా చీలిపోయిన గ్రూప్ 1 అభ్యర్థులు ఎవరికి వారు తమకే న్యాయం జరుగుతుందని భావిస్తున్నారు. కానీ, న్యాయస్థానాలు వెలువరించే తీర్పును బట్టే ఎవరికి ఉద్యోగాలొస్తాయి? ఎవరికి పోతాయి? అనేది స్పష్టమవుతుందని అంతా భావిస్తున్నారు.దాదాపు 14 ఏళ్ల తర్వాత గ్రూప్ నియామకాలు జరుగుతున్నాయి. అయితే తొలి నుంచి ఈ నియామకాల ప్రక్రియ వివాదాల చుట్టే తిరుగుతోంది. దీంతో ఎన్నో ఆశలు పెట్టుకున్న అభ్యర్థులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా 2022 ఏప్రిల్ 26న 503 గ్రూప్ 1 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. 2022 అక్టోబర్ 16న ప్రిలిమి నరీ పరీక్షలు నిర్వహించగా, 2023 ఆగస్టులో మెయిన్ పరీక్షలు నిర్వహిస్తామని టీజీపీఎస్సీ ప్రకటించింది.

ఈలోగా గ్రూప్ 1తోపాటు పలు పోటీ పరీక్షల ప్రశ్న పత్రాల లీకేజీ వ్యవహారం వెలుగులోకి రావడంతో గ్రూప్ 1 పరీక్షను టీజీపీఎస్సీ రద్దు చేసింది. 2023 జూన్ 11న మరోసారి ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షను పార దర్శకంగా నిర్వహించలేదని, లోపాలు జరిగాయ ని పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో అప్పుడు కూడా ఆ పరీక్షను రద్దు చేస్తూ తీర్పు వెలువడింది.ఆతర్వాత రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకావడం, టీజీపీఎస్సీ ప్రక్షాళన చేయడంతో పాటు 503 పోస్టులకు గానూ మరో 60 పోస్టులను కలిపి మొత్తం 563 పోస్టులతో కాంగ్రెస్ ప్రభుత్వం 2024 ఫిబ్రవరిలో గ్రూప్ 1 నోటిఫికేషన్‌ను వేసింది. 2024 జూన్ 9న ప్రిలిమినరీ పరీక్ష, అక్టోబర్ 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు.

ఈ ఏడాది మార్చి 10న అభ్యర్థుల ప్రొవిజనల్ మార్కుల జాబితాను టీజీపీఎస్సీ విడుదల చేయగా, మార్చి 30న జనరల్ ర్యాంకింగ్ జాబితాను విడుదల చేసింది.అదేవిధంగా ఏప్రిల్ 10న 563 ఉద్యోగాలకు ఎంపికైన గ్రూప్ 1 అభ్యర్థుల తుది జాబితా ను విడుదల చేసి ధ్రువపత్రాల పరిశీలనను కూడా చేపట్టింది. అయితే మెయిన్ పరీక్షల్లో అవకతవకులు జరిగాయని పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో గ్రూప్ మెయిన్ పరీక్షల మార్కులు, ర్యాంకింగ్ జాబితాను రద్దు చేస్తూ హైకోర్టు సింగిల్ బెంచ్ ఈ ఏడాది సెప్టెంబర్ 9న తీర్పు ఇచ్చింది. అంతేకాకుండా జవాబు పత్రాలను మరోసారి మూల్యాంకనం చేయాలని లేదా తిరిగి మెయిన్స్ పరీక్షను ఎనిమిది నెలల్లోగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయి తే దీనిపై గ్రూప్ 1 ఉద్యోగాలకు ఎంపికైన కొం దరు అభ్యర్థులు, టీజీపీఎస్సీ.. హైకోర్టు డివిజన్ బెంచ్‌కు అప్పీల్‌కు వెళ్లడంతో సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధిస్తూ సెప్టెంబర్ 24న మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది.ప్రభుత్వం నియామకాలు చేపడితే అవి రిట్ అప్పీళ్ల తుది తీర్పుకు లోబడి ఉంటాయని కూడా చెప్పడం గమనార్హం. దీంతో ఉద్యోగాలకు ఎంపిక కాని కొందరు అభ్యర్థులు డివిజన్ బెంచ్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో ఆ పిటిషన్‌ను కోర్టు మంగళవారం డిస్పోజ్ చేసింది.

## మళ్లీ సుప్రీంకు వెళ్లే ఆలోచన..!

టీజీపీఎస్సీ గ్రూప్ 1 ఉద్యోగాలకు ఎంపికైన వారి జాబితాను విడుదల చేయడంతో సెప్టెంబర్ 27న వారికి నియామకపత్రాలను రాష్ట్ర ప్రభు త్వం అందజేసింది. 562 మందికి సీఎం రేవంత్ రెడ్డి తన చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. నియమాకపత్రాలు పొందిన వారి లో కొందరు డిప్యూటీ కలెక్టర్లు, ఎక్సైజ్ డీఎస్పీలు, ఇతర పోస్టులకు చెందినవారూ ఉన్నారు. చాలా మంది ఇప్పటికే తమ తమ ఉద్యోగాల్లో చేరారు కూడా.అయితే కోర్టు తుది తీర్పుకు లోబడే మీ ఉద్యోగాలుంటాయని అపాయింట్ మెంట్ ఆర్డర్లు అందుకున్న అభ్యర్థుల నుంచి అధికారులు డిక్లరేషన్ తీసుకున్నట్లు తెలిసింది. ఒకవేళ వీరికి అనుకూలంగా డివిజన్ బెంచ్ తీర్పు వస్తే వీరి ఉద్యోగాలకు భద్రత ఉంటుంది. లేకుంటే వీరు సుప్రీం కోర్టును ఆశ్రయించే అవకాశం ఉంటుందని పలువురు అభ్యర్థులు చెబుతున్నారు. గ్రూప్ 1 ఉద్యోగాలకు ఎంపికకాని అభ్యర్థులకు అనుకూలంగా తీర్పు రాకపోతే వారు సైతం సుప్రీం కోర్టును మళ్లీ అశ్రయించేందుకు సమాయత్తం అవుతున్నట్లు ఓ అభ్యర్థి తెలిపారు. చివరికి ఈ అంశం సుప్రీంకు చేరనుందని ఆయన పేర్కొన్నారు. ఎవరికి న్యాయం జరగకున్నా ఇది ఇలాగే సాగుతోందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఏదిఏమైనా ఈనెల 15న హైకోర్టు తీర్పుతో ఈ ఉత్కంఠకు తెరపడనుంది.

# ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అవగాహన సదస్సు

జయభేరి, పరవాడ:



జాతీయ బాలికా దినోత్సవంలో భాగంగా బాలికలకు అవగాహన కార్యక్రమం పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం ప్రభుత్వ జడ్పిహెచ్ హైస్కూల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిషోర బాలికలకు పోషకాహార ప్రాముఖ్యత గురించి ఐసిడిఎస్ సూపర్వైజర్ హెచ్. వి రమణి, గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు పాఠశాల విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ రమణి మాట్లాడుతూ విద్యార్థినిలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని,పరిసరాల పరిశుభ్రత పాటించాలని, బాల్య వివాహాలు జరగకుండా చూసుకోవాలని,అత్యధిక పోషక విలువలు కలిగిన ఆహారాలను తీసుకోవాలని,ఆకుకూరలు,పండ్లు,పాలు, పీచు పదార్థాలు,ఐరన్ సంబంధిత ఆహార పదార్థాలు ఎక్కువ తీసుకోవాలని, రక్తహీనతకు గురికాకుండా, ఉషకాహార లోపాన్ని గురికాకుండా ఆరోగ్యంగా ఉంటూ చదువుతూ చక్కటి శ్రద్ధతో చదువుకోవాలని బాలికలు అన్ని రంగాల్లో అగ్రస్థానం పొందాలని, సత్ప్రవర్తంతో చదువు పట్ల శ్రద్ధ చూపుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా చింతకాయల సుజాత ముత్యాలు మాట్లాడుతూ మహిళందరూ పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు, అనంతరం స్కూల్ విద్యార్థులందరికీ గేమ్స్ ఆడించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు,అంగన్వాడి టీచర్లు, చింతకాయల ముత్యాల రాణి, మైలపల్లి రమాదేవి, సమ్మంగి ముత్యాలమ్మ, చోడవరం మహేశ్వరి, ఎర్రిపల్లి గౌతమి ,తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ కొండంత అండ

- ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

ఆర్థిక ఇబ్బంది ఉన్నా అనారోగ్యంతో భాధపడి ఆసుపత్రి లో చికిత్స తీసుకున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. శుక్రవారం నంద్యాల బొమ్మలసత్రంలోని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో ఆళ్లగడ్డ మండలం బత్తులూరు గ్రామానికి చెందిన గజ్జల నాగశేషులుకు మంజూరు అయిన సీఎం రిలీఫ్ ఫండ్ రూ. 8.50 లక్షల చెక్కును భాధితుడికి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మనస్సున్న మారాజు అని, పేద రోగులకు ఆర్థిక ఇబ్బంది లేకుండా సీఎం రిలీఫ్ ఫండ్ విడుదల చేస్తూ అండగా ఉంటున్నారని, భాధితులు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతులుగా ఉండాలని ఆమె కోరారు.

# చిత్స్వరూప!

తే.గీ. ప్రణవ జపమును చేయగా పరమపురుషు
దనుభవము లోకి వచ్చును ఆత్మ యందు;
దానినే ముక్తి యందురు ధాత్రి లోన
చేరి కొలుతును నిన్ను నే చిత్స్వరూప!

తే.గీ. దేహమందలి మలినాలు దినము దినము
తొలగి పోవలె తప్పక తొందరించి
అట్లు జరిగిన ఆరోగ్య మందవచ్చు
చేరి కొలుతును నిన్ను నే చిత్స్వరూప!

ఆ.వె. ఇంద్రియమ్ము లైదు నెంతయు నిద్రలో
ప్రాణ వశము నందు పవ్వళింప
ఆత్మ యప్పుడు పరమాత్మతో సుఖియించు
చేరి కొలుతు నిన్ను చిత్స్వరూప!

ఆ.వె. గురువులొసగు నట్టి గొప్ప జ్ఞానము చేత
అంధకార మెప్పు డంతరించు
గురువనంగ జ్యోతి గర్తుంచు కోవాలె
చేరి కొలుతు నిన్ను చిత్స్వరూప!

తే.గీ. ధర్మ రక్షకుం దధినేత ధరణి లోన
విస్తరించుచు తన ఖ్యాతి పెరుగు చుండ
విశ్వ శాంతికి మార్గము వేయగలడు
చేరి కొలుతును నిన్ను నే చిత్స్వరూప!



జక్కని వేంకటరాజం
సిరిసిల్ల. 94400 21734



# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి ఎంపిక

జయభేరి, తుర్కపల్లి, అక్టోబర్ 10:

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి విద్యార్థులకు జిల్లా కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల అండర్ 19 స్కూల్ గేమ్స్ కబడ్డీ గేమ్ లో తుర్కపల్లి మండలం మోడల్ స్కూల్ కు చెందిన విద్యార్థిని దాసారం రాధిక ఇంటర్ సెకండ్ ఇయర్ సిఇసి విద్యార్థిని రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు మోడల్ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు పల్లె రమేష్ రెడ్డి తెలిపారు. ఈనెల 10,11,12 తేదీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్ లో జరుగు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపల్ అంబటి శోభారాణి, ఉపాధ్యాయ బృందం అభినందించారు. రాబోవు కాలంలో మంచి ప్రతిభ కనబరిచి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాంతులు తీసుకురావాలని కోరారు.

# విదేశాల నుంచి వచ్చిన ఆదాయంపై బయటపెట్టాలి

- కర్రె ప్రవీణ్



జయభేరి, యాదగిరిగుట్ట అక్టోబర్ 10 :

తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహా స్వామి వారి కల్యాణోత్సవాలను విదేశాల్లో జరిపిస్తున్నారని, విదేశాల నుంచి వచ్చిన ఆదాయాన్ని వెంటనే బయటపెట్టాలని బీజేపీ యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట ఆలయానికి చెందిన ఉద్యోగులు, అర్చకులు రెండు దఫాలుగా స్వామివారి కల్యాణం కోసం విదేశాలకు వెళ్లారని కానీ ఇప్పటికీ కల్యాణోత్సవాల ద్వారా ఎంత ఆదాయం వస్తుందో దేవస్థానం ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. కల్యాణోత్సవం పేరుతో ఇక్కడ పాలనను గాలికొదిలేసి డీఈవో,ఏఈవో స్థాయి అధికారులు కూడా దాదాపు 40 రోజులు విదేశాలకు వెళ్లడమేంటని, దాంతో ఇక్కడ పాలన కుంటుపడుతుందన్నారు. ఆలయంలో మరో డీఈవో ఉన్నా ఏఈవోకు దేవస్థానం బాధ్యతలు అప్పగించడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. విదేశాల్లో స్వామివారి కైంకర్యాల ద్వారా ఎంత ఆదాయం వచ్చిందో వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్వార్థం కోసం విదేశాలకు వెళ్తున్నారో లేక ఆలయానికి ఆదాయం తెస్తున్నారో వెంటనే దేవాదాయశాఖ కమిషనర్, ఈవో స్పందించాలని డిమాండ్ చేశారు.



# 500కోట్ల క్లబ్‌లో కాంతార చాప్టర్1

'కాంతార చాప్టర్ 1' భారతీయ బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షాన్ని కురిపిస్తున్నది. విడుదలైన 9రోజుల్లోనే ఈ చిత్రం 500కోట్ల వసూళ్ల మైలురాయిని చేరుకుంది. దీంతో ఈ ఏడాది అత్యధిక కలెక్షన్స్ సాధించిన రెండో చిత్రంగా నిలిచింది. ఇదే స్థాయిలో థియేట్రికల్ రన్ కొనసాగితే ఈ సినిమా 800కోట్ల మార్క్‌ను కూడా దాటే అవకాశాలున్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సినిమా వసూళ్లను వెల్లడిస్తూ శుక్రవారం చిత్రబృందం ఓ పోస్టర్‌ను విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది రోజుల్లో 509కోట్లు సాధించినట్లు వెల్లడించింది. రిషబ్‌శెట్టి స్వీయ దర్శకత్వంలో రూపొందించిన 'కాంతార చాప్టర్ 1' ఈ దసరా రోజున ప్రేక్షకుల ముందుకొచ్చింది. దక్షిణాది భాషలతో పాటు ఉత్తరాదిన ఈ సినిమా భారీ వసూళ్లతో దూసుకుపోతున్నది.

# వెబ్‌సిరీస్‌కు నిర్మాతగా హృతిక్‌రోషన్



బాలీవుడ్ అగ్ర నటుడు హృతిక్‌రోషన్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై నిర్మాతగా అడుగుపెట్టబోతున్నారు. స్వీయ నిర్మాణ సంస్థ హెచ్‌ఆర్‌ఎక్స్ ఫిలిమ్స్ పతాకంపై ఆయన 'స్ట్రామ్' (వర్కింగ్ టైటిల్) పేరుతో ఓ థ్రిల్లర్ వెబ్‌సిరీస్‌ను తెరకెక్కించబోతున్నారు. ఇది అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుంది. అర్జిత్‌పాల్‌సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సిరీస్‌లో పార్వతి తిరువోతు, అలయా , శ్రిష్టి శ్రీవాత్సవ, రమా శర్మ, సబా అజాద్ తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించనున్నారు. ముంబయి నేపథ్యంలో జరిగే థ్రిల్లర్ కథాంశమిదని, అనేక చిక్కుముదులను విప్పుతూ ఉత్కంఠను పంచుతుందని దర్శకుడు తెలిపారు. ఇలాంటి రా అండ్ రస్టిక్ ఎలిమెంట్ ఉన్న కథాంశంతో ఓటీటీలో నిర్మాతగా అడుగుపెట్టడం ఆనందంగా ఉందని, గ్లోబల్ ఆడియెన్స్‌ను ఆకట్టుకునే సిరీస్ ఇదని హృతిక్‌రోషన్ తెలిపారు ఈ సిరీస్ చిత్రీకరణను త్వరలో మొదలుపెట్టబోతున్నారు.



# ఫారిన్ వీధుల్లో రెచ్చిపోయిన హీరోయిన్..

ఫోటోలో కనిపిస్తున్న అమ్మడు సైతం ఒకప్పుడు చైల్డ్ ఆర్టిస్ట్. వెంకటేశ్, మోహన్ లాల్ వంటి స్టార్ హీరోలకు కూతురిగా కనిపించింది. ఆ తర్వాత హీరోయిన్ గా ఆఫర్స్ కోసం వెయిట్ చేసింది. కానీ అంతగా సక్సెస్ మాత్రం కాలేకపోయింది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ లండన్ లో మాస్టర్స్ చేస్తుంది. ఈ క్రమంలోనే ఫారిన్ వీధుల్లో గ్లామర్ లుక్స్ లో ఫోటోలకు ఫోజులిచ్చింది. ఈ బ్యూటీ ఫోటోస్ ఇప్పుడు నెట్టింట తెగ వైరలవుతున్నాయి. ఒకప్పుడు బాలనటిగా.. అమాయకమైన నటనతో కట్టిపడేసిన ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు హీరోయిన్లకు ధీటుగా గ్లామర్ ఫోజులతో నెట్టింట హీటెక్కిస్తోందంటూ ఆశ్చర్యపోతున్నారు నెటిజన్స్. ఇంతకీ ఆమె ఎవరో గుర్తుపట్టారా.. ? తనే ఎస్తేర్ అనిల్. ఎస్తేర్ అనిల్.. మలయాళంలో చైల్డ్ ఆర్టిస్ట్. అలాగే తెలుగులోనూ పలు సినిమాల్లో కనిపించింది. మోహన్ లాల్ నటించిన దృశ్యం సినిమాలో కనిపించింది. వెంకటేశ్, మీనా కలిసి నటించిన దృశ్యం సినిమాలో వెంకీ చిన్న కూతురిగా నటించింది. ఆ తర్వాత పలు సినిమాల్లో నటించింది. ఇప్పుడు ఈ అమ్మడు లండన్ లో మాస్టర్స్ చేస్తుంది.
ఈ క్రమంలోనే కొన్నాళ్ల క్రితం అక్కడ ఓ రెస్టారెంట్ లో ఆమె పనిచేసినట్లు గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. లండన్ లో మాస్టర్స్ చేస్తున్న సమయంలో తనను తాను పోషించుకోవడానికి కొంతకాలం రెస్టారెంట్‌లో పనిచేశానని తెలిపింది. ఆ సమయంలో తాను ఎంతో కష్టపడ్డానని.. శారీరక ఒత్తిడి, మానసిక ఒత్తిడి ఎదుర్కొన్నట్లు తెలిపింది. ఎస్తేర్ మూడో తరగతిలో ఉండగానే.. మోహన్ లాల్ తో కలిసి నటించిన 'ఒరు నాల్ వరుమ్' సినిమాతో గుర్తింపు తెచ్చుకుంది. ఆ సినిమా ఆమెను అందరి దృష్టిని ఆకర్షించింది. 'దృశ్యం' మూడు భాషా వెర్షన్లలో నటించి తనకు పాన్‌ఇండియన్ గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పుడు ఈ అమ్మడు హీరోయిన్ గా సరైన బ్రేక్ కోసం వెయిట్ చేస్తుంది.

# ఈ హీరోయిన్ అందరికంటే చిన్నదా..



టాలీవుడ్ చాలా మంది హీరోయిన్స్ ఓవర్ నైట్ లో క్రేజ్ తెచ్చుకుంటున్నారు. అలాంటి వారిలో ఆ బ్యూటీ ఒకరు. ఆమె అందరికంటే చిన్న ఏజ్ ఉన్న హీరోయిన్ ఆమె. టాలీవుడ్ లో యంగ్ హీరోయిన్ అంటే ముందు గుర్తొచ్చేది కృతిశెట్టినే .. చిన్న వయసులోనే ఈ అమ్మడు ఇండస్ట్రీలోకి వచ్చింది. ఉప్పెన సినిమాతో హీరోయిన్‌గా మారిన ఈ అమ్మడు వయసు ఇప్పుడు 20 ఏళ్లు. అలాగే కన్నడ ఇండస్ట్రీ నుంచి వచ్చిన కుర్రాడి శ్రీలీల ఏజ్ కూడా తక్కువే.. పెళ్ళిసందడి సినిమాతో పరిచయమైన ఈ బ్యూటీ వయసు 23. ఈ ఇద్దరి కంటే ఓ హీరోయిన్ చిన్నది. ఆమె ఎవరంటే రీసెంట్ డేస్ లో ప్రేక్షకులను మెప్పించిన సినిమాల్లో మ్యాడ్ సినిమా ఒకటి. సంతోష్ శోభన్, నార్ని నితిన్, రామ్ నితిన్, ప్రధానపాత్రల్లో నటించిన మ్యాడ్ సినిమాలో నటించింది అననతిక. మ్యాడ్ సినిమాతో టాలీవుడ్ కు పరిచయం. చిన్నది ఈ సినిమాలో తన నటనతో అందంతో ఆకట్టుకుంది. అలాగే రజినీకాంత్ నటించిన లాల్ సలామ్ అనే సినిమాలోనూ నటించింది. ఇటీవలే ఎనిమిది వసంతాలు అనే సినిమాలో మెరిసింది. ఈ సినిమాకు మంచి టాక్ వచ్చింది. ఈ చిన్నదాని ఏజ్ కేవలం 19ఏళ్లు మాత్రమే. ఇప్పుడు ఈ ముద్దుగుమ్మ టాలీవుడ్ లో వరుసగా అవాకాశాలు అందుకుంటుంది.

# బామ్మర్ది పెళ్లి దగ్గరుండి చేసిన ఎన్టీఆర్.. వైరల్ అవుతున్న హీరో నార్నే నితిన్ పెళ్లి ఫొటోలు

టాలీవుడ్ యువహీరో నార్నే నితిన్ వివాహబంధంలోకి అడుగుపెట్టారు. ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ బామ్మర్ది అయిన నార్నే నితిన్, శివానీ అనే యువతిని వివాహం చేసుకున్నారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్ శివారులోని శంకర్‌పల్లిలో జరిగిన ఈ పెళ్లి వేడుకకు సినీ, రాజకీయ ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.
ఈ వేడుకలో ఎన్టీఆర్ తన భార్య లక్ష్మీ ప్రణతితో పాటు కుమారులు అభయ్ రామ్, భార్గవ్ రామ్‌లతో కలిసి హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తారక్ కుటుంబం ఎంట్రీ ఇచ్చిన వేళ హౌస్ ఫుల్ హంగామా నెలకొంది.
పెళ్లి ఫొటోలు, వీడియోలు ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారి నెట్టింట సందడి చేస్తున్నాయి.
వధువు శివానీ నెల్లూరు జిల్లాకు చెందిన వెంకట కృష్ణప్రసాద్ - స్వరూప దంపతుల కుమార్తె. ఆమె కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉండటంతో పాటు టాలీవుడ్ సీనియర్ హీరో దగ్గుబాటి వెంకటేష్‌కు కజిన్ డాటర్ కావడం విశేషం. ఈ బంధం వలననే సినీపొలిటికల్ వర్గాల్లో పెళ్లి వేడుకపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది.
2023 నవంబర్ 3న నార్నే నితిన్, శివానీల నిశ్చితార్థం హైదరాబాద్‌లో జరగగా, ఇప్పుడు అక్టోబర్ 10న వీరిద్దరూ పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు. ఈ వేడుకకు ఎన్టీఆర్ దంపతులతో పాటు దగ్గుబాటి కుటుంబ సభ్యులు, ఇతర సినీ ప్రముఖులు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. నార్నే నితిన్ 2023లో "మ్యాడ్" సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. మొదటి సినిమా నుంచే ఎనర్జిటిక్ పెర్ఫామెన్స్‌తో అభిమానులను మెప్పించాడు.
అనంతరం "ఆయ్", "మాడ్ స్క్వేర్" సినిమాలతో వరుసగా హ్యాట్రిక్ హిట్లు సాధించి ప్రామిసింగ్ యాక్టర్‌గా నిలిచాడు. ఇటీవలే



"శ్రీశ్రీశ్రీ రాజావారు" అనే సినిమాతో మరోసారి ప్రేక్షకుల ముందుకొచ్చాడు. ప్రస్తుతం నార్నే నితిన్ శివానీల పెళ్లి వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నార్నే నితిన్, శివానీల జోడికి సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్ట్‌లు చేస్తున్నారు.మరోవైపు NarneNithinWedding అనే హ్యాష్ ట్యాగ్ ట్రెండింగ్‌లోకి వచ్చేసింది!

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**